# ధర్మవాహిని



భగవాన్
శ్రీ సత్యసాయిబాబా

# 4

# స్త్రీ ధర్మముల ప్రాశస్త్యం

**లోకధర్మములకు కారణభూతములు స్త్రీ, పురుష జన్మలు :**

లోకమున మానవులు ఆచార ధర్మములను అనేకముగా పేర్కొందురు. కానీ, అవన్నియూ జీవిత నిమిత్తమై ఈ ప్రపంచమున ఉపయోగించు సూత్రములే కానీ సత్యధర్మములు కావు; ముఖ్య ధర్మములు కావు. ఇన్ని ధర్మకర్మలకూ కారణ భూతములైన జన్మలు రెండు : అవే స్త్రీ, పురుషుడు. ఇవే ప్రకృతి, పరమాత్ముడు; ఇవే జడము, చైతన్యము. ఇంత సృష్టి దేని ఆధారమున ఏర్పడినదన్న జడచైతన్యముల సంబంధము వల్లనే కదా? అట్లే ఇన్ని ధర్మములూ దేని నిమిత్తమై యేర్పడినవి? ఇన్ని ధర్మములకూ కారణమేది? అని లోతుగా విచారించిన స్త్రీ పురుషులను ఈ రెండు జన్మలే. కాన, వీరి ధర్మములు, వీరి ఆచారములే లోకమునకు ప్రధాన ధర్మములు. ఏ మహనీయులు ఏ రీతిగా చెప్పిననూ ఎన్నిగా నిరూపించిననూ, ఈ రెండు తెగలు తప్ప మరే ఆధారమూ లేదు కదా!

కాన, స్త్రీ ధర్మము, పురుషధర్మము, ప్రధాన ధర్మములు. మిగిలిన ధర్మములు వీని అంగములు. గోదావరినదికి ఎన్నో పాయలు చేరినట్లు వారివారి ధర్మమునకు అనేక అవసర ధర్మములు, ఆధార ధర్మములు అందులో లీనమగును. ఆధారమైన నదిని

ప్రధానముగా తీసుకొందుమే కానీ, అందులో లీనమైన చీలిక నదులను మనము తలంచము. అట్లే, ప్రధానమైన ప్రకృతి ధర్మములు మనము ఆధారముగా తీసుకొనవలెను కాని, అందులో మిళితమైన అంగధర్మములను ఆధారముగా తీసుకొనకూడదు. దీనిని పట్టి చూడ, లోకధర్మములు రెండే. ఒకటి స్త్రీధర్మము, రెండవది పురుషధర్మము.

**స్వార్థరహితమైన పవిత్రప్రేమ స్త్రీలకు సహజ గుణము :**

స్త్రీ ధర్మము : దీనినే భగవానుని భ్రాంతి, అనగా శక్తి అందురు. అదే మాయ; దాని స్వరూపమే స్త్రీ. అందుకని స్త్రీ పరాశక్తి స్వరూపము అని కూడా కొందరు తెలుపుదురు. ఆమెయే మానవుని విశ్వాసపాత్రమగు సహచరి. జీవిత భాగధేయ. స్త్రీ, భగవానుని ఘనమగు చేత, ప్రకృతి యొక్క విచిత్రము. అద్భుతములో అద్భుతము. పిండాండము. గృహమునకు రాణి, వాస్తవిక పరిపాలనా మాయయొక్క ప్రతినిధి. గృహాలంకారమగు లక్ష్మి, మానవుని మధుర మిత్రము. అట్టి శక్తిస్వరూపులైన స్త్రీలు పురుషుని కంటె ఏ విషయములోను అల్పులు కారు. వారు తమ వాస్తవిక స్వభావరీత్యా యెంతటి ఓరిమి, యెంతటి క్షమ, భక్తి ప్రేమ యుతులు!

వారి యందు అనేక సుగుణములున్నవి. వారి ఆత్మనిగ్రహము పురుషునకుండదు. వారు ఆధ్యాత్మికపథమును త్రొక్కుటకు మార్గదర్శకులు. స్వార్థరహితమైన పరిశుద్ధప్రేమ స్త్రీలకు లోపుట్టిన

గుణము. తెలివి, నాగరికత, అనురాగబద్ధ ధార్మికచింతన గల స్త్రీలు గృహమునకు లక్ష్మివంటివారు. ఎచ్చట సతీపతులు పవిత్రప్రేమయనెడి త్రాటితో లంకింపబడుదురో, యెచ్చట సతీపతులు ప్రతిదినము ఆధ్యాత్మికగ్రంథముల పారాయణ మొనర్చుచూ హరినామమును సంకీర్తించుచుందురో, ఆ గృహమే వైకుంఠము. తన భర్తయెడ అనురాగబద్ధయగు స్త్రీ పృథివిపై నొక అరుదగు సువాసన పుష్పము. కుటుంబమునకు విరాజమానమగు మణివంటిది. సుగుణవంతురాలగు సతి, పతికొక చూడామణి.

**స్త్రీలకు పతివ్రతాధర్మము ప్రధాన లక్ష్యము :**

స్త్రీలకు పతివ్రతాధర్మము ప్రధానలక్ష్యము. ఆ సచ్ఛీల శక్తిచే వారు దేనినైనను చేయగలరు. అట్టి మహాశక్తిచేతనే సావిత్రి తన గతించిన భర్తయగు సత్యవంతునకు తిరిగి ప్రాణము రప్పించెను. ఆమె వాస్తవికముగ మృత్యుదేవునితో పోరాడెను. అత్రిఋషి భార్యయు, దత్తాత్రేయుని తల్లియగు అనసూయ పాతివ్రత్యము అందరికీ తెలిసిన విషయమే. ఆమె తన పాతివ్రత్యశక్తిచే త్రిమూర్తులను గూడ పసిబిడ్డలుగ మార్చగలిగెను. నాలాయని తన కుష్ఠు భర్త ప్రాణమును కాపాడుటకు సూర్యుని సంచారమునే ఆపివేసెను.

పాతివ్రత్యమే స్త్రీలకు శిరోమణి. లోకముచే ఎక్కువగా కొనియాడబడునది స్త్రీకి ఈ లక్షణమే. ఈ శక్తిని వర్ణింపనెట్టి

వారికిని సాధ్యముకాదు; కానేరదు. గొప్ప విపత్తులలో పడిపోయినప్పటికినీ స్త్రీ తన పాతివ్రత్యశక్తిచే సులభముగా రక్షింపబడును. స్త్రీకి పాతివ్రత్యమే జీవనము. స్త్రీ తన స్వకీయ యత్నములద్వారా తన్నుతాను కాపాడుకొని నిస్సంశయముగ స్వర్గమును పొందును. తన్ను బాధించ యత్నించునపుడు కేవలమొక మాటచే దమయంతి ఒక బోయవానిని బూడిదగ దగ్ధపరచెను. రాజగు నలుడు తన సర్వస్వమును కోల్పోయి, తన శరీరమున ఒంటిబట్టతో అరణ్యమున ప్రవేశించినపుడు, ఆమె సంతోషముతో పతి యిక్కట్టులు పంచుకొనెను.

**స్త్రీకి లజ్జ అతిముఖ్యమైన ఆభరణము :**

స్త్రీకి లజ్జ అతిముఖ్యము. అది స్త్రీకి ఒక ఆభరణము. లజ్జ యొక్క సరిహద్దు దాటి చరించుట స్త్రీకి ధర్మవిరుద్ధము. అంతియేగాక దీనివలన అనేక అపాయములకు గురియగును; స్త్రీ శోభనే విధ్వంస మొనర్చును. లజ్జ లేకున్న, సౌందర్యమూ నాజూకూ లేని స్త్రీగా కనిపించును. అణకువ, వినయ విధేయతలు, కోమలత్వము, సాధుత్వము, మధురత్వము, వీని విచిత్ర మిశ్రమమే లజ్జ. లజ్జ అనునది స్త్రీకి మిక్కిలి అమూల్యమైన ఆభరణము. లజ్జగల స్త్రీ యౌచిత్యభావనచే హద్దులో నుండును; అట్టి స్త్రీ ఉత్తమ ప్రవర్తనలు కలిగియుండవలెను. లజ్జ నిజమైన ఘనతకు ఒక గుర్తు. లజ్జయే లేకున్న స్త్రీలు తమజాతికి అపకారము చేసిన వారేకాక తమ ధర్మమును నిర్మూలన చేసినవారగుదురు; అట్టి వారిది

వాసనలేని పుష్పమువలె లోకమున రాణింపులేని జీవితము అగును. ఇతర సుగుణములు ఎన్ని యున్నప్పటికినీ లజ్జ లేకున్న, జీవితము కేవలము శూన్యము.

లజ్జ అనునది స్త్రీని దివ్యమైన పవిత్ర పదవులకు లేవనెత్తును. లజ్జగల స్త్రీ యింటా, బయటా, జగత్తునందే గౌరవముల నధికారముగ గొనును. “నేటి కాలమున లజ్జను బజ్జీలుగా చేసి మ్రింగుచున్నారే? వారికి లేని గౌరవమేలేదు!” అని కొందరనవచ్చును. నేటి ప్రవర్తనలతో నాకు పరిచయ మక్కరలేదు. అందులో నేను ప్రవేశింపను. అవి కేవలము గౌరవ మర్యాదలు కావచ్చును. కానీ అధికారగౌరవములు కావు. అనగా గౌరవమునకు అర్హులు గాని వారికిచ్చు మర్యాదలు అమర్యాదలుగనే భావించవలెనేకాని, అట్టివి మర్యాదలని భావించుటకూడా ఒక ద్రోహమే. అవి ముఖస్తుతి గౌరవములు; ఉమ్మి వేసిన మలినము వంటివి.

లజ్జగల స్త్రీ యిట్టి గౌరవమర్యాదలు కానీ, పేరు ప్రతిష్ఠలు కానీ ఆశించదు. కేవలము తన హద్దులను మాత్రము దృష్టి యందుంచుకొని ప్రవర్తించుచుండును. తనకు తెలియకయే గౌరవ మర్యాదలు పొందుచుండును. పుష్పములందూ, కమలములందూ ఉన్న మాధుర్యము తుమ్మెదలను కోరుచున్నదా? తేనెటీగలను పిలుచుచున్నదా? ఆ మాధుర్యమును చవిచూచిన వగుటచే అవియే వెదుకుచూ వచ్చును. మాధుర్యమునకు తుమ్మెదలకూ ఉన్న

సంబంధమే దానికి కారణము. అట్టిదే హద్దులను గుర్తెరిగిన స్త్రీకి, అధికారగౌరవములకు గల సంబంధము. అట్టి పవిత్ర స్త్రీ గౌరవ మర్యాదలను ఆశించదు. అదే ఆత్మధర్మము.

కమలముపై కప్ప కూర్చొని నేను కమలముపై నున్నానని గర్వించును కానీ, కమలమందలి మకరందమును తాను త్రాగినదా? చవి చూచినదా? అసలు ఉన్న సంగతైనను తెలియునా? తెలియదు. అట్లే నేటి మర్యాదలు కూడను. పేరు ప్రతిష్ఠలను కుప్పలపై కప్పలవలె కూర్చొని, అందులోని అంతరార్థము, అందులోని నిజధర్మము, దాని యందలి విశ్వాసము, గౌరవము, వాని విలువ తెలియనివారైయుండిన అది గౌరవమా? అదొక మర్యాదా? కాదు, కాదు. దానిని మర్యాద అని కాదు; వ్యాధియని అనవచ్చును.

నిజముగా లజ్జలేని స్త్రీని, స్త్రీ అని చెప్పుటకు కూడ ఆత్మ ధర్మము అంగీకరించదు. ఆత్మధర్మ సంబంధములేని గౌరవ మర్యాదలు శవముయొక్క అలంకారములగును. శవమున కెన్ని అలంకారములు చేసినప్పటికిని అందుండి వెలువడిన జీవి ఆనందించునా? అట్లే యథార్థమును గుర్తెరుగనివారికీ, ఆత్మార్థమును అనుభవించనివారికీ, కీర్తిగౌరవములను కిరీటములు పెట్టిన ఆనందించు వారెవ్వరు? ఇట్టి అర్థములేని మర్యాదలకు లొంగక ఆత్మ గౌరవమునకు ఆహుతి కావటమే, లజ్జగల స్త్రీ యొక్క లక్షణము. ఇట్టి లక్షణమే గృహమునకొక లక్ష్మి. అందువల్లనే ఇల్లాలిని గృహలక్ష్మి అనికూడా అనుచుందురు.

**మతము, గృహము నిలువవలెనన్న స్త్రీయే కారణము :**

పై లక్షణము లేకున్న, గృహమే అవలక్షణ మనబడును. మతము, గృహము నిలువవలెనన్న స్త్రీయే కారణము. మతము నిలుచుటకుగానీ, నాశనమగుటకుకానీ స్త్రీయే కారణము. వారిలో విచిత్రమైన మతవిషయికాంతర సహజప్రేరణ కలదు. 'భక్తి, విశ్వాస, వినయము గల స్త్రీలు-పురుషుల జీవితములలో దైవిక వర్తన, అనుష్ఠానములను ప్రవేశపరతురు. వారు పెందలకడనే లేతురు. గృహములను శుభ్రపరతురు. స్నానాది కృత్యములు తీర్చికొని జపధ్యానముల నొనర్తురు. తమతమ యిండ్లయందు నిత్యపూజకై ఒక చిన్నగదిని దేవళముగా నియమింతురు. అందులో భగవానుని పటములను, విగ్రహములను, పరమభక్తుల, మహనీయుల, జ్ఞానుల, మార్గదర్శకుల చిత్రములను అలంకరింతురు. వారాస్థలమును పవిత్రముగానుంచి ఉదయము, సాయంత్రమున విశేష దినములందు మరీ యెక్కువగా ప్రార్థనలు, పూజలు, భజనలు, హారతి జరుపుకొందురు. అంతియేకాక అట్టి స్త్రీ తన ఒత్తిడిచేత, యింటియందలి నాస్తిక పురుషునికూడా, ఏవియో ప్రార్థనలో లేక సత్కార్యమునో లేక మరే యితర భగవత్సంబంధమైన పరోపకార చింతననో ఒనర్ప బలవంతము చేయుచుండును.

నిజముగా గృహమును పాలించువారే స్త్రీలు. అదియేవారి ధర్మము. వారు నిజముగా శక్తియొక్క వ్యక్త స్వరూపిణులు. అట్లుకాక, భర్త ఆధ్యాత్మిక మార్గములో నెగువకు ప్రయత్నించు చుండగా, భార్య అట్టి మార్గమును సమ్మతింపక ఇంద్రియ విషయ

మార్గమున లాగుచూ, లేక భార్య ఆధ్యాత్మిక మార్గములో ఉత్తమ స్థానమునకు జనుచుండ భర్త ఇంద్రియ విషయ మార్గములో ఆమెను దిగువకు లాగుకొనుచుండిన, అట్టి గృహము గృహము కాదు, అదొక గ్రహము. పిశాచులు తిరుగాడు పాడుస్థలమన వచ్చును . అట్టి గృహము పృథ్విపై ప్రత్యక్ష నరకమే.

అట్లుగాక, నిజముగా స్త్రీ తన ధర్మమునకు తాను బలికావలెనన్న ఆత్మజ్ఞానమనెడి సూత్రముతో మేళవింపుగా కలుపబడి, భగవచ్చైతన్య మొందుటకు ఆతృతగా కాంక్షించవలెను. ఏ గృహమున భార్యాభర్తలు ఆదర్శజీవితము గడుపుదురో, భగవన్నామమును సంకీర్తింతురో, సత్కార్యముల ఆచరింతురో, సత్య, ప్రేమ, శాంతులతో ధార్మిక గ్రంథముల పారాయణ మొనర్తురో, ఇంద్రియముల వశపరచుకొని సర్వజీవులయందును సమాన దృష్టితో మెలగుదురో, ప్రేమను వెలిబుచ్చుదురో, అట్టి స్త్రీ పురుషులు నివసించు గృహము నిజముగా స్వర్గమే అగును.

**పతినే పరమాత్మగా భావించి సేవ చేయుటయే స్త్రీ నిజధర్మము :**

అట్టి ఉత్తమ గృహిణియే నిజమగు భార్య. ఏ స్త్రీ తన భర్త పట్ల హృదయమున అనురాగబద్ధయై యుండునో ఆమెయే నిజమగు గృహలక్ష్మి. ఏ స్త్రీ తన భర్తపట్ల విశ్వసనీయమై యుండునో ఆమెయే నిజమగు ఇల్లాలు. ఆమెయే ధర్మపత్ని. భార్య ధర్మార్థ కామములకు మూలము. భర్త మనస్సెరిగి మధురముగా సంభాషించు స్త్రీ, భర్తకు భార్యమాత్రమే కాదు, ఒక్కొక్క సమయమున ధార్మిక

కృత్యావసరముల తంత్రివంటిది; వ్యాధి బాధల సమయములందు ఆమె తల్లి వంటిది.

మొదట తన పతి సేవ, పతి అభీష్టము, అతని ఆజ్ఞ తన నిత్య ఆరాధనగా తలంచి తదుపరి పరమాత్మ ఆరాధన, ప్రార్థన చూచుకొనవలెను. పతిని తృప్తి పరుపక ఆరాధనయందు ఆత్మానందమును అనుభవించలేరు. పతియందే పరమాత్మను నిరూపించుకొని, పరమాత్మసేవగా చేయు సతి నిజధర్మమును గుర్తెరిగినదై యుండును. ఆత్మార్థమును ఆధారముగా కల్పించుకొని కర్మలాచరించిన సర్వమును పరమాత్మ సేవగానే ఫలించును; తరించును. పతి యెట్టివాడైనప్పటికినీ సతి అతనిని ఆనందింపజేసి అతనిని సన్మార్గ వర్తనునిగా తీర్చవలెను. భగవంతుని అనుగ్రహమునకు పాత్రుడగునట్లు ప్రయత్నించవలెను. తానెట్లు పోయిన నేమి, నేను మాత్రము అనుగ్రహమునకు అర్హురాలైన సరి, అను ధర్మవిరుద్ధ భావములు స్త్రీలకు అవలక్షణములు. పతి క్షేమము, పతి ఆనందము, పతి అభీష్టము, పతి సద్గతే తనకు సర్వ రక్షగా భావించవలెను. అట్టి స్త్రీకి పరమాత్మ అనుగ్రహము అప్రయత్నముగా లభించును, వర్షించును. అట్టి స్త్రీకి పరమాత్ముడు సర్వవిధములా అండయై, నిండు దయను జూపును. అట్టి స్త్రీ సద్గుణములచేత పతికూడను సద్గతి పొందును.